మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## మల్లికార్జున్ ఖర్గేను కలిసిన మంత్రి దామోదర



మల్లికార్జున్ ఖర్గేను కలిసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, అక్టోబరు 15, (ప్రభాతవార్త):** ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను బుధ వారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహ, సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మల్లికార్జున్ ఖర్గే శస్త్ర చికిత్సలు జరిగినందున ఆరోగ్యం విషయం అడిగి తెలుసుకున్నారు. మల్లికార్జున్ ఖర్గేను కలిసినవారిలో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కూచుకుల్ల రాజేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బెజ్జంకిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ హైమావతి

**బెజ్జంకి, అక్టోబరు 15, (ప్రభాతవార్త):** కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యంలో ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం రాగానే వెంటనే గన్నీ సంచుల్లో నింపాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని బెజ్జంకి మార్కెట్ కమిటీ గోదాంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, టార్పలిన్ కవర్లు, పాడీ క్లీనర్లు,గన్నీ బ్యాగులు ఇతర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులేవరు దళారుల వద్దకు వెళ్లి ధాన్యం అమ్ముకొని నష్టపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకొని మద్దతు ధరను పొందాలన్నారు. బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబరు లింక్, ఆధార అప్డేట్ చేసుకుంటే పేమెంట్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు రావాలని రైతులకు సూచించారు. అనంతరం బెజ్జంకి మండల కేంద్రంలో పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీకాంత్,ఎంపిడివో తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

## విద్యార్థి వివేక్ మృతి చెందడం దురదృష్టకరం

### మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** పది రోజుల క్రితం తోటి పిల్లలతో ఆడుకుంటూ గురుకుల విద్యార్థి వివేక్ ప్రమాదవశాత్తు మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ విచారం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతి చెందిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం సందర్శించారు. విద్యార్థి వివేక్ మృతి చెందిన ఘటనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ప్రమాదవశాత్తు మృతి చెందడం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కానీ ఇంకా మరేదైనా కోణం ఉందా అనే విషయంపై పోలీసుల విచారణ జరుగుతుందని చెప్పారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వపరంగా సహాయం, చేస్తామని విద్యార్థి మృతిని ఎవరూ రాజకీయం చేయెద్దన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా గురుకులాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎంపి రఘునందన్‌రావును కలిసిన బిజెపి నాయకులు



ఎంపి రఘునందన్‌రావుతో గజ్వేల్ బిజెపి నాయకులు

**గజ్వేల్, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావును హైదరాబాద్‌లోని నివాసంలో బిజెపి గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ గజ్వేల్‌లో బిజెపి చేస్తున్న అభివృద్ధిపై, పలు ప్రజా సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఇటీవల గజ్వేల్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలపై ఎంపి అభినందించినట్లు పేర్కొన్నారు. త్వరలో గజ్వేల్ పట్టణ పరిధిలో ఉన్న పెండింగ్ పనులపై అధికారులతో మాట్లాడుతానని తెలిపినట్లు పేర్కొన్నారు. ఎంపిని కలిసిన వారిలో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెప్యాల వెంకట్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్‌కుమార్, నాయకులు గడియారం రాజేశ్వర్‌చారి తదితరులు ఉన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి : డిఆర్‌డిఏ పిడి



మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పిడి జయదేవ్‌ఆర్య

**ములుగు, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని డిఆర్‌డిఏ పిడి జయదేవ్‌ఆర్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ మామిడ్యాల గ్రామంలో అలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జి మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మేరీ స్వర్ణకుమారి, డిపిఎం విద్యాసాగర్, ఏపిఎం ఆనంద్, ఏఎల్ఈఏపి సంస్థ ఖాసీం, ఎంఎస్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, వివో లీడర్లు విజయ, లక్ష్మి, భాగ్య, సిసిలు, వివోఏలు, ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొన్నారు.

## పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాసుదేవ్

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** పద్మశాలి ఉద్యోగుల సంఘం సిద్దిపేట జిల్లా ఎన్నికలను బుధవారం ఎన్నికల అధికారి సిహెచ్. నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించగా గజ్వేల్ పట్టణానికి చెందిన దేవసాని వాసుదేవ్ పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వాసుదేవ్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న పద్మశాలిల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తనను రెండవసారి గెలిపించినందుకు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. వధూవరుల పరిచయవేదిక ద్వారా పెండ్లి సంబంధాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని, పెండ్లి సంబంధాలు ఏమైనా ఉంటే వాట్సాప్ గ్రూపుద్వారా బయోడేటా, ఫోటో పంపించాలని తెలిపారు. ఉద్యోగులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ చేపిస్తామని, కొత్త సభ్యత్వం కార్యక్రమం చేపడతామని, తాత్కాలిక ఉద్యోగులను కూడా మన సంఘంలో సభ్యత్వం ఇచ్చి భాగస్వాములను చేస్తామన్నారు.



పద్మశాలి ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగులు

# ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబర్ 15, ప్రభాతవార్త:** ఖరీఫ్ 2025-26 ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు మంత్రులు సూచించారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణరావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా జరగాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సంగారెడ్డి జిల్లా నుండి కలెక్టర్ పి.ప్రావీణ్య, అద నపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖ, గ్రామీ ణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు

**జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా సాగాలి**

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ముందుగా హార్వెస్టర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదని, ప్రతి మండలం, నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులు, సూపర్వైజర్లు నియమించాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వాతావరణ శాఖ రిపోర్టులను కేంద్ర నిర్వాహకులకు తెలియజేయాలనిఅన్నారు. సమావేశంలో డిఎం సివిల్ సప్లై అధికారి అంబదాస్ రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్‌కుమార్, పిడి డిఆర్డిఏ జ్యోతి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దీపిక, ప్రతిభ, తూనికలు కొలతల శాఖ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు రాకుండా చూడాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, క్రీడల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, సిఎస్ రామకృష్ణరావు బుధవారం హైదరాబాద్ నుంచి ధాన్యం కొనుగోళ్ల పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, సంబంధిశాఖ అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులు తగు సౌకర్యాలు కల్పించడంతో పాటు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా ట్రాన్స్‌పోర్టు, గన్ని బ్యాగుల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాంలకు తరలించడానికి అవసరం మేరకు ట్రాక్టర్లను వినియోగించుకోవాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాలలో హమాలీల సమస్యలు రాకుండా చూసుకోవాలని



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా స్థాయి అధికారులు

పేర్కొన్నారు. మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం జరగకుండా మిల్లర్లకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. మిల్లులను తరచూ తనిఖీలు చేయాలని, రైతుల బ్యాంకు ఖాతా, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ వివరాలు సరిచూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలు స్థానిక ప్రజాప్రతినిధుల చేత ప్రారంభించేలా చూడాలని చెప్పారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో సమస్యలు ఉంటే 7995050809కు ఫిర్యాదు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, పౌరసరఫరాలశాఖ అధికారి తనూజ, సివిల్ సప్లై డిఎం ప్రవీణ్, జిల్లా ఇన్‌చార్జి డిటిఓ లక్ష్మణ్, వ్యవసాయ అధికారి స్వరూపరాణి పాల్గొన్నారు.

# నేటి నుంచి పటాన్‌చెరులో ఎస్జిఎఫ్ క్రీడా సంబరాలు



క్రీడా మైదాం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, అక్టోబరు 15, ప్రభాతవార్త**

నేటి(గురువారం) నుండి 18వ తేదీవరకు మూడు రోజులపాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా నిలవబోతోంది. స్వతహాగా క్రీడాకారుడు, క్రీడల పట్ల అత్యంత శ్రద్ధ కనబరిచే పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలకు మైత్రి మైదానాన్ని సిద్ధం చేశారు. సొంత నిధులతో క్రీడా పోటీలతోపాటు, క్రీడాకారులకు ఉచిత వసతి, భోజనం, ట్రోఫీలు, జాతీయస్థాయి పోటీలకు ఎంపి కయ్యే క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. 33 జిల్లాల నుండి 400 మంది క్రీడాకారులు, 60 మంది శిక్షకులు, 160మంది వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడ సంబరాల్లో పాల్గొనబోతున్నారు. మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా వాలీబాల్, కబడ్డీ అంశాలలో ఈ పోటీలు జరగనున్నాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం అదృష్టం**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్‌చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మొదటిసారి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు పటాన్‌చెరును వేదికగా నిలపడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వంతో పలుమార్లు చర్చించిన అనంతరం ఈ అవకాశం లభించింది. పటాన్‌చెరులో మొట్టమొదటిసారి జరగబోతున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున క్రీడాభిమానులు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. త్వరలో మహిళల కబడ్డీ జాతీయ పోటీలకు పటాన్‌చెరు వేదికగా నిలవబోతుందని తెలియజేసేందుకు సంతోషకరంగా ఉంది. నియోజకవర్గంలోని ప్రతి క్రీడాకారుడిని రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు.

# బాణాసంచా విక్రయాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలి

### సిద్దిపేట జిల్లా సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** బాణాసంచా విక్రయాలకు సంబంధిత పోలీసు స్టేషన్ల నుంచి అనుమతి తీసుకోవడంతోపాటు దీపావళికి భద్రతా ప్రమాణాలు పాటించాలని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటుచేస్తే పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు కమిషనరేట్ పరిధిలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో తాత్కాలికంగా ఏర్పాటుచేసే దుకాణాల యజమానులు సంబంధిత పోలీసు స్టేషన్ల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసే బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీపావళి పండుగను పురస్కరించుకొని బాణాసంచా విక్రయదారులపై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాణాసంచా దుకాణాలతో ప్రజలకు ఏదైనా ఇబ్బందికరంగా ఉంటే వెంటనే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ 8712667100 కాల్ చేయాలన్నారు. జిల్లాలో ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

**వివిధ అంశాలలో పోటీలకు ఆహ్వానం**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఈనెల 21 నుంచి 31 వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో ఆన్‌లైన్‌లో నిర్వహించడం జరుగుతుందాని చెప్పారు. 21 నుంచి 24 వరకు పోలీసుస్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసుశాఖలలోని వివిధ విభాగాల సేవలు, పోలీసులు చేసిన త్యాగాలు, ప్రతిభను వివరించడం జరుగుతుందన్నారు. ఈనెల 28 వరకు డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండాలనే అంశంపై ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి సీపీ కార్యాలయంలో బహుమతులు అందించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ముగ్గురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించాలని కోరారు. పోలీసు చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, విజేతలకు బహుమతులు అందించి రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

వీడియోలు ఈనెల 23లోపు ఫొటోలు, పెన్‌డ్రైవ్‌లో వేసిన షార్ట్‌ఫిల్మ్‌ను సీపీ కార్యాలయంలోని పిఆర్‌ఓకు అందించాలని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## హత్య కేసులో ఇరువురికి యావజ్జీవ కారాగార శిక్ష

### -రూ.22 వేల జరిమానా..సిద్దిపేట సిపి విజయ్‌కుమార్

**ములుగు, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** తల్లిని హత్య చేసిన కొడుకుతోపాటు అతడి స్నేహితునికి యావజ్జీవ కారాగారశిక్ష, రూ. 22 వేల జరిమానా విధించడం జరిగిందని సిద్దిపేట జిల్లా పోలీస్‌కమిషనర్ ఎస్ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి బుధవారం ములుగు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విజయ్‌కుమార్ రికార్డులను పరిశీ లించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హత్యకు సంబంధించిన వివరాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేక రుల సమావేశంలో తెలిపారు. ములుగు మండలం బండమైలారం గ్రామానికి చెందిన వెంకటమ్మను 2023 ఆగస్టు 24వతేదీన గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి రెండు కాళ్ళకు ఉన్న కడియాలు దొంగి లించుకుపోయారని ఆమె కూతురు పర్వతం శైలజ ములుగు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన తల్లితో కొడుకు ఈశ్వర్, అతని స్నేహితుడు రాము ఇరువురు గొడవపడుతున్నారని వారిపై అనుమానం వ్యక్తం చేసింది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి గజ్వేల్ రూరల్ సిఐ జానకిరామ్‌రెడ్డి కేసు పరిశోధన ప్రారంభించి పై నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగిందని తెలిపారు. తదుపరి పరి శోధనలో టెక్నికల్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత కేసు పరిశోధన పూర్తిచేసి నేరస్తులపై కోర్టులో చార్జిషీట్ వేయడం జరిగిందన్నారు. ఆరోజు నుండి సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగిందని, బుధవారం జడ్జి జయప్రసాద్ ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తులపై నేరం రుజువైనందున ఇరువురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 22 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ములుగు ఎస్ఐ విజయ్ కుమార్, అప్పటి గజ్వేల్ రూరల్ సిఐ జానకిరామ్‌రెడ్డి, ప్రస్తుత సిఐ మహేందర్‌రెడ్డి, గజ్వేల్‌ఏసిపి నరసింహులు, కోర్టు మానిటర్ ఇన్‌స్పెక్టర్ సైదా, ఎస్ఐ గంగరాజులు కోర్టులో సాక్ష్యం ఎలా చెప్పాలో సాక్షులను మోటివేట్ చేయ డం జరిగిందన్నారు. నేరస్థులకు శిక్షపడడానికి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ఆత్మరాములు వాదనలు వినిపించారని, ఎస్ఐ విజయ్‌కుమార్, సిఐలు జానకిరాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, కోర్టు మానిటర్ అధికారులు కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, లోకేష్ కీలకపాత్ర వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపి విజయ్‌కుమార్ ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు అధికారులను, సిబ్బందిని అభినందించారు. త్వరలో నగదు పురస్కారం అందజేస్తామని తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య

**జహీరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** అప్పుగా డబ్బులు తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వనని చెప్పడంతో అప్పు ఇచ్చిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని అల్లిపూర్ షేరినగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం...కోహీర్ మండలం చింతలగట్టు గ్రామానికి చెందిన రాజు ఎంఆర్ఎఫ్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. రాజు భార్య కొత్తగొల్ల స్వప్న(34)కు బంగారంపై తీసుకున్న రుణం తిరిగి చెల్లించాలని రూ. 4 లక్షల ఇవ్వగా ఆ 4 లక్షలు తనకు తెలిసిన గుర్జువాడ నివాసుడైన శంకర్‌కు అప్పుగా ఇచ్చి భర్తకు విషయం తెలిపింది. కొన్ని రోజుల తర్వాత స్వప్న తీసుకున్న అప్పు ఇవ్వాలని శంకర్‌ను కోరగా డబ్బులు ఇవ్వను అని చెప్పడంతో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలి భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

## గల్లంతైన ప్రమీల అస్థిపంజరం లభ్యం

**కొల్చారం, అక్టోబరు 15(ప్రభాతవార్త):** మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన టెక్మల ప్రమీల నెల రోజుల క్రితం ప్రమాదవశాత్తు మంజీరా నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. కాగా మంజీరా నది నెల 15 రోజుల నుండి ఉధృతంగా ప్రవహించడంతో గల్లంతైన ప్రమీలను రెస్క్యూ టీం సహాయంతో వెతికినా దొరకలేదు. రెండు రోజుల క్రితం నుండి వరద ఉధృతి తగ్గడంతో చిన్న ఘనపూర్ గ్రామ శివారులోని లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ఒక చెట్టుకు చీరతో అస్తి పంజరం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ప్రమీల కుటీంబీకులు చేరుకుని చీర ఆనవాళ్లతో ఆమెను గుర్తించారు. కొల్చారం ఎస్సై సంఘటన స్తలాన్ని పరిశీలంచారు.

## అనారోగ్యంతో మాజీ ఉప సర్పంచ్ మృతి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం మదూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప్ప సర్పంచ్ రమేష్ కొంత కాలంగా అనారోగ్య సమస్యతో భాపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రమేష్ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. రమేష్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసి గత సర్పంచ్ ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా పోటీచేసి ఉపసర్పంచ్‌గా ఎంపికై గ్రామానికి సేవలు అందించాడు. తనకు కుడిచేయి లేకపోయిన మనోధైర్యాన్ని కోల్పోలేదు. గతంలో గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యావాలంటరీగా విదులు నిర్వహించాడు. గ్రామం చుట్టుపక్కల రమేష్ సార్ అంటే తెలియని వారు ఉండరు. అనేక మంది విద్యార్థులకు విద్యనుబోదించి వారికి ఉన్నతమైన విలువలను నేర్పాడు. ఉపసర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందిస్తూ ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించాడు. రెండు సంవత్సరాల కిత్రం ప్రభుత్వ ఉద్యోగం రాగా ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేశాడు. ప్రస్థుతం మెదక్ రిజిస్టార్ కార్యాలయంలో విదులు నిర్వహిస్తున్నాడు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు రమేష్ అంత్యక్రియల్లో పాల్గోన్నారు.

## పటాకుల లోడ్‌తో వెళుతున్న రెండు వ్యాన్లను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

**హత్నూర, అక్టోబరు 15, ప్రభాతవార్త :**

హత్నూర మండలం రెడ్డి పాలెం గ్రామం పరిధిలోని పటాకుల గోదాం నుండి జీఎస్టీ చెల్లించ కుండా డిసిఎం వ్యాన్లలో తరలిస్తున్న పటాకుల లోడుతో కూడిన, రెండు డీసీఎం వ్యాన్లలను బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పట్టుకున్నారు. అనంతరం వాటిని హత్నూర పోలీస్ స్టేషన్కు తరలించారు. రెడ్డిపాలెం గ్రామం లో ఉంచిన స్టాక్ గోదామును హత్నూర ఎస్సై, విజిలెన్స్ అధికారులు, జిఎస్టి అధికారులు సంయుక్తం గా సందర్శించి తనిఖీలు చేశారు. హత్నూర పోలీస్ స్టేషన్లో జిఎస్టి లెక్కలను పరిశీలించారు. చెల్లించాల్సిన జీఎస్టీ కంటే తక్కువ చెల్లిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు.



విజలెన్స్ అధికారులు పట్టుకున్న డీసీఎం

## ఒగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య

### -సిరికొండ మధుసూదనాచారి



ప్రసంగిస్తున్న తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త:**

వోగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య తెలంగాణ శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ గడ్డ కళలకు కాణాచి, ఎన్నో కళా రూపాలు వైభవంగా వెలుగు చూసిన నేలపై వోగ్గు కళా రూపం అపురూపం అని అన్నారు. వోగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య అని అయన పేర్కొన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సంగీత నాట్య వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా చుక్కా సత్తయ్య యాది లో సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా మధుసూదనా చారి పాల్గొని మాట్లాడుతూ అక్షరం ముక్క రాకున్నా జాతీయ అంతర్జాతీయ స్థాయికి వోగ్గు కథను నిలిపిన చుక్కా సత్తయ్య కు పద్మ అవార్డ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు అయన వుంటే తప్పక దక్కేదన్నారు. విఖ్యాత నటుడు ఎన్‌టీఆర్‌ను కూడా అయన తన ప్రదర్శనతో మెప్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాహితీకిరణం పత్రికా సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, గాయని పులిపాక రమాదేవి పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం సేవలు ఎంతో గొప్పవి : శ్రీలత శోభన్‌రెడ్డి


అబ్దుల్ కలాం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మోతె శోభన్‌రెడ్డి

**తార్నాక, అక్టోబర్ 15 ప్రభాతవార్త :**

శాస్త్రసాంకేతిక రంగంలో అజరామరమైన సేవలు అందించిన దివంగత భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా బుధవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి కలిసి తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కలాం జీవితం ప్రతి భారతీయ యువతకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. మన దేశాన్ని అణ్వాయుధ రంగంలో స్వావలంబిగా తీర్చిదిద్దిన గొప్ప శాస్త్రవేత్త. ఆయన స్మరణ ప్రతి పౌరునిలో దేశభక్తి భావాన్ని మళ్లీ మేల్కొలపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌లాల్, డివిజన్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొని కలాం సేలను స్మరించుకున్నారు.

### నేటి నుంచి 'హాకా దీపావళి టపాసులు విక్రయం' ప్రారంభం

**సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త:**

కొన్ని దశాబ్దాలుగా జంటనగరాలు, శివారు ప్రాంతాలలోని లక్షలాది మంది వినియోగదారులకు విశేషమైన సేవలు అందించిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ హాకా ( ది హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్) దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 16వ తేదీ 21వ తేదీ వరకు ఇందిరా పార్కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో 'హాకా దీపావళి టపాకాయల' విక్రయం ప్రారంభిస్తున్నది. వినియోగదారుల సౌకర్యార్థం 6 స్టాల్స్ ఏర్పాటు చేశామని, శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వందలాది రకాల 'స్టాండర్డ్ బ్రాండ్' టపాయకాలను విక్రయించేందుకు అనుభవం కలిగిన ఉద్యోగులను, సిబ్బందిని సిద్ధం చేశామని హాకా బిజినెస్ మేనేజర్ వెంకటరెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలుగా అగ్నిమాపక కేంద్రం అధికారులు, పోలీసు అధికారుల నియమ నిబంధనలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వినియోగదారుల సేవలే లక్ష్యంగా హాకా దీపావళి టపాకాయలను ప్రతి ఏడాది విక్రయిస్తున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా అతి తక్కువ లాభాలతో విక్రయిస్తున్నామని ఆయన మీడియాకు చెప్పారు. పార్కింగ్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నామని, ఈ ఏడాది మూడు కోట్లరూపాయల విలువగల టపాకాయలను విక్రయించి, వినియోగదారులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఉన్నామని, 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు 24 గంటల పాటు స్టాల్స్ తెరిచే ఉంటాయిని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలను ప్రభుత్వం అదుకోవాలి

**సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీ టీచర్లకు, అయాలకు రిటైర్డ్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణకుమారి డిమాండ్ చేశారు. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్స్, ఆయాల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలతో మృత్యు ఒడిలోకి సమీపంలో ఉన్నారని వారిని మానవతా దృక్పథంతో ప్రభుత్వం అదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన టీచర్స్‌కు 2 లక్షలు, ఆయాలకు 50 వేలు వడ్డీతో సహా చెల్లించాలని, పెన్షన్ నెలకు 5వేలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**నార్సింగి, అక్టోబర్ 15 ప్రభాతవార్త :** విద్యుత్ లైన్ల మధ్య మరమత్తుల కారణంగా ఈ క్రింది ఫీడర్ల మధ్య విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని నార్సింగి సెక్షన్ ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్ పరిధిలోని 11.కేవీ బాలాజీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.గంటల నుంచి 11.గంటల వరకు మంచిరేవుల, మంత్రి విల్లాస్, గ్రీన్ ల్యాండ్ అండ్ జైహిందు కాలనీలో కరెంటు సరఫరా ఉండదని వివరించారు. ఇందుకు వినియోగదారులంతా సహకరించాలని ఏఈ మణికంఠ తెలిపారు.

## అప్పుల బాధతో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఆత్మహత్య

**నార్సింగి, అక్టోబర్ 15 ప్రభాతవార్త :**

అప్పుల బాధలు తట్టుకోలేక మనస్థాపం చెందిన ఓ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం రామ్‌దేవ్‌గూడ ప్రాంతానికి చెందిన రాములు(55) ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల చేసిన అప్పులు తీరే మార్గం లేక నిత్యం ముబావంగా ఉంటూ, తనలో తానే కుమిలిపోతూ కనిపించాడు. ఈ నెల 14.వ,తేదీ ఉదయం 10.గంటల సమయంలో రాములు తన భార్య ఉమారాణితో గొడవ పడ్డాడు. అప్పుడే ఇంటి నుంచి బయటకు వెళ్లి మంచిరేవుల వద్ద ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, భార్య ఉమారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

# గండిపేట మండలంలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

### - కలాం ఆశయ సాధనకు కృషి చేయాలని నేతల పిలుపు


మణికొండలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను జరుపుకుంటున్న మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి తదితరుల దృశ్యం


హైదర్షాకోట్‌లో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి తదితరులు

**నార్సింగి, అక్టోబర్ 15 ప్రభాతవార్త :**

భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను గండిపేట మండలంలోని నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. మణికొండలో మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి నాయకత్వంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం అధ్భుతమైన అణు శాస్త్రవేత్త అని, ఆయన వల్లనే నేడు భారతదేశం అణుశక్తితో అగ్రరాజ్యాల సరసన నిలబడగలిగిందన్నారు. రాష్ట్రపతిగా, లెక్చరర్‌గా అనేక పాత్రల్లో అమాంతం ఇమిడిపోయి భారత జాతికి సేవలు చేశారని వివరించారు. అలాగే హైదర్షాకోట్‌లోని కలాం విగ్రహానికి బండ్లగూడ కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి నాయకత్వంలో పూలమాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కటిక పేదరికంలో జన్మించి, అనేక ఇబ్బందులు పడుతూ విద్యను అభ్యసించి, దేశ అత్యుతన్నత పదవులను అధిరోహించిన మహామనీషి అబ్దుల్ కలాం అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తుందని, యువత ఆయన వలే కలలు కని, వాటి సాఫల్యతకు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు యాలాల నరేష్, శ్రీరాములు, కుమార్, శ్రవణ్, గంగాధర్, దేవేందర్, నాగిరెడ్డి, మధు, శేషు, వేణు, దత్తు, సునీల్, విష్ణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రకుల పక్షపాతి బిజెపి ఓబిసి రిజర్వేషన్‌ల రద్దుకు కుట్ర

### సిపిఐ నేత ఇ.టి.నర్సింహ్మ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహ్మ

**సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** బ్రాహ్మణ, బనియా పార్టీగా పేరొందిన దురహంకార అగ్రకుల పక్షపాతి బిజెపి ఓబిసి రిజర్వేషన్‌లను రద్దుచేసే కుట్రలకు పాల్పడుతున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మ ఆరోపించారు. నాటి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఓబిసి రిజర్వేషన్‌లపై మండల్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలనే నిర్ణయాన్ని బిజెపి గట్టిగా వ్యతిరేకించిందని ఆయన ఆరోపించారు. ఓబిసి గుర్తింపు తిరస్కరించడం, కుల ఆధారిత రిజర్వేషన్లను వ్యతిరేకించడంలో సంఘ్ పరివార్ ఆదేశాలను బిజెపి తూచా తెలంగాణలో బిసి రిజర్వేషన్‌లపై ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నదని ఆయన విమర్శించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్, బిజెపిల చరిత్ర ఎప్పుడు దళితులు, అనగారిన, బలహిన వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఉంటుందని, అందుకే తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించగా, సమావేశంలో కార్యిదర్శి స్టాలిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, కౌన్సిల్ సభ్యుడు ఎం.నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి సేవచేస్తేనే జీవితానికి సార్ధకత : డా. కె.వి.రమణాచారి



వితంతువుల పిల్లలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రమణాచారి, విజయలక్ష్మి, హనుమంతరావు, సాయిబాబా, నర్సింహాచారి తదితర అతిథులు

**నాంపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త :** ఒకజ్యోతి మరెన్నో జ్యోతులను వెలిగించినట్లే సమాజంలో ప్రతీఒక్కరూ చేసే సేవే మరెందరిలోనూ జీవనకాంతులను విరాజిల్లింపజేసి వారి జీవితానికి సార్థకత చేకూరుస్తుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి హితవుపలికారు. ప్రముఖ భారత వికాస పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దయెత్తున జరిగిన నిస్సహాయ వితంతువుల పిల్లలైన విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చే విద్యావికాస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణాచారి సుప్రసిద్ధ ఆర్థిక ప్రదాత అశ్విని సుబ్బారావు, విశిష్ట అతిథులు హైదరాబాద్ ఉన్నత విద్య సంచాలకురాలు విజయలక్ష్మి, ఏసిపి వై.హరీష్‌కుమార్, కె.సాయిబాబా, వివేకానం సేవాసమితి ఛైర్మన్ సిహెచ్.హనుమంతరావు, ఎ.జలవేందర్‌రావు, ట్రస్టు కార్యదర్శి సాధన నరసింహాచార్య, నరేంద్రకృష్ణ, చైతన్య, సుధ తదితరులతో కలిసి వితంతువుల పిల్లలైన నిస్సహాయ 115మంది అభాగ్య విద్యార్థులకు విద్యావికాస్ స్కాలర్‌షిప్ కింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి శుభాశీస్సులు తెలిపారు. ట్రస్ట్ ఛైర్మన్ అశ్విని సుబ్బారావు తమన సంస్థ ఆధ్వర్యంలో దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో గత సంవత్సరం 300,ఈ సంవత్సరం 600మంది అభాగ్య విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఏసిపి హరీష్‌కుమార్ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా విద్య, సమాజహితం కోసం దీక్షబూనాలని సూచించారు.

# అంధుల సమస్యల విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చొక్కారావు

**సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంధుల సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఐఎఎస్‌తో గాని, రిటైర్డ్ జడ్జితోగాని స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషనర్‌ను నియమించాలని తెలంగాణ అంధుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. అంధుల విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో త్వరలో కార్యచరణ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని నాయకులు హెచ్చరించారు. అంతర్జాతీయ వైట్ కేన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చొక్కారావు, జి.అంజయ్యగౌడ్ తదితరులు మాట్లాడుతూ పదవి వరమణ చేసిన అంధ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని, అంధుల కోసం బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించడానికి ఒక కమిటిని నియమించి భర్తీ చేయాలని, విద్యా పరమైన అర్హత ప్రకారం కాకుండా 100 శాతం అంధత్వం ఉన్న వారికే మొదటి ప్రాధాన్యత ఇచ్చి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం అంధులకు సంబంధించిన అన్ని ప్రయోజనాలను తక్కువ శాతం అంధత్వం ఉన్నవారు పొందుతున్నారని ఆరోపించారు. అంధుల సమాజం కోసం పనిచేస్తున్న అంధుల పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు 50 లక్షలు కేటాయించిన ప్రభుత్వం అంధుల పాఠశాలలు, అంధుల సంస్థలు, వికలాంగుల కోసం పనిచేస్తున్న అన్ని ఎన్జీఓలకు గ్రాంటు మంజూరు చేయాలని, అన్ని బస్‌లలో అంధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఎన్.పరమేష్, అజిత్‌కుమార్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం : పరమేశ్వర్‌రెడ్డి


గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త :**

రామంతాపూర్ గాంధీనగర్ మల్టీ ఫంక్షన్ హాల్లో సమీపంలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ ఆధ్వర్యంలో పలువురు అధికారులతో కలిసి సమస్య పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ మల్టీ ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీ సమస్య ఇక్కడి కాలనీవాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, ఫంక్షన్ హాల్‌ను నిర్మించి దానికి సరైన అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యను రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎండి.రఫిక్ తన దృష్టికి తీసుకుని రావడంతో స్పందించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని జలమండలి డిజిఎం రజినీకాంత్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు మహమ్మద్ రఫీక్, గాంధీనగర్ అధ్యక్షులు మొగిలి లింగం, పబ్బు గంగాధర్, రమేష్ బిక్షపతి, సిద్ధిరాములు, అశోక్, గట్టయ్య, శంకరాచారి, నరసింహ, జహంగీర్, నరేష్, సయ్యద్, మహ్మద్ నయిమ్ వల్లపు శ్రీకాంత్‌యాదవ్, సందీప్, భాస్కర్, బుల్లెట్ అశోక్ పాల్గొన్నారు.

## పెండింగ్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,అక్టోబరు 15 ప్రభాతవార్త :**

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాలాజినగర్, లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు, బృందావన్ కాలనీలోని పుల్లిగుట్ట నాలా పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు సాండు యాదవ్, డివిజన్ మాజీ అధ్యక్షులు అడికే జనార్ధన్, బిజెపి నాయకులు హనుమంత్ రెడ్డి, అడికే శివ, ధనరాజ్. ధన్‌రాజ్, సతీష్, రంజిత్‌సింగ్, రజనీ కాంత్, శ్రీ కాంత్ రెడ్డి, అనిల్ రాజు, శంకర్ రెడ్డితో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.

# పోషణ పక్షం ..ఆరోగ్య లక్ష్యం




**అత్తాపూర్ అక్టోబరు15,ప్రభాతవార్త :**

చిన్నారులు,గర్భిణులు,బాలింతలు పోషకాహారం లోపాన్ని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతంగా మారేలా పోషణ పక్షం ..ఆరోగ్య లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఐపిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాలలో పోషణ పక్షం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమా రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ ,పలువురు అధికారులు హాజరై మాట్లాడారు... కిశోర బాలికలకు రక్తహీనత, పరిశుభ్రత, సమతుల ఆహారం గురించి అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలు వంటి పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా సహజ శ్రేయస్సుకు దోహదపడాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్య తెలంగాణ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పోషణ పక్షోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. అనంతరం పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎస్. లక్ష్మి,లలిత, ఎం. సంగీత, బస్తీ దవాఖాన డాక్టర్ వినీత్, అశా వర్కర్లు మీనా, టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు,పాల్గొన్నారు.

## పాతబస్తీలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్ అరెస్ట్

**చార్మినార్,అక్టోబరు 15 ప్రభాతవార్త :** పదకొండు ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసిన ఓ ఆటో డ్రైవర్‌ను మీర్‌చౌక్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ కథనంప్రకారం.... మొగల్‌పుర ప్రాంతానికి చెందిన పదకొండు ఏళ్ల బాలిక ఓ ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుచున్నది. మంగళవారం సాయంత్రం బాలిక పాఠశాల నుంచి ఇంటికి ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్నది. ఇది గమనించిన రెయిన్‌బజార్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ షబ్బీర్ (36) మీ నాన్న ఆటోలో నిన్ను ఇంటికి తీసుకు రమ్మన్నాడని బాలికకు మాయ మాటలు చెప్పాడు. బాలికతో పాటు బాలుడిని కూడ ఆటోలో ఎక్కించాడు. కొంత దూరం ఆటో వెళ్లిన తర్వాత ఆటో నుంచి బాలుడిని దింపేశాడు. బాలికను ఆటోలో తీసుకుని ఆటోడ్రైవర్ మలక్‌పేట్ వైపు వెళ్తూ మధ్యలో ఆటో నిలిపి బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక భయంతోఆటో నుంచి కిందికి దూకి పారి పోయింది. స్థానికులు ఆటో డ్రైవర్ షబ్బీర్‌ను చితక బాది మీర్‌చౌక్ పోలీసులకు అప్పగించారు. ఆటో డ్రైవర్ షబ్బీర్‌పై కిడ్నాప్, ఫోక్సో చట్టం కిద కేసులు నమోదు చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ కేసును మీర్‌చౌక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పశువులకు తప్పనిసరి గాలికుంటు టీకాలు వేయించండి : ఏడి సుభాష్

**కొత్తూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త:**

కొత్తూరు మండలంలో 343 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువుల ఆరోగ్యం కాపాడేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం ప్రతి రైతు బాధ్యతగా భావించాలన్నారు పశుసంవర్ధక విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుభాష్. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తూరు మండలంలోని ఎస్.బి.పల్లి, ఇమ్మన నర్వ గ్రామాల్లో పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీకాలు వేశారు. మొత్తం 343 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ సుభాష్ తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీలోని కొత్తూరు తండాలో కౌన్సిలర్ సోమ్లా నాయక్, డాక్టర్ స్ఫూర్తి పాల్గొని పశువులకు టీకాలు వేయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేసి, పశువైద్య సిబ్బందిని అభినందించారు. రైతులు తమ పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రవి,హేమంత్, రైతులు హర్య,తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పై గుంతలను పూడ్చేందుకు మట్టికి అనుమతులు ఇవ్వండి

**కేశంపేట అక్టోబర్ 15 ప్రభాతవార్త**

కేశంపేట మండల పరిధిలోని సంతపూర్ గ్రామం నుండి చౌలపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గత కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు గుంతల మాయంగా మారి ప్రయాణించడానికి ఇబ్బందిగా ఉన్నందున సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడానికి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేత సాజిత్ మట్టి తెచ్చుకోవడానికి అనుమతి ఇవ్వాలని తాసిల్దార్ రాజేందర్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. రోడ్డు అద్వానంగా తయారు కావడంతో 80,000 ఖర్చు చేసి రహదారిపై మట్టి పోసి రైతుల రాకపోకలు సులభతరం అయ్యేలా చర్యలు తీసుకునేందుకు నడుం బిగించారు. ఈ విషయ పై తాసిల్దార్ కు మట్టి పోయటానికి కొత్తచెరువు నుండి మట్టి తీసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. గ్రామ అభివృద్ధి కోసం యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వరలక్ష్మి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అశోక్, మధరం బలరాజ్, లక్ష్మీనారాయణ, లింగం, నవీన్, అశోక్, అర్జున్, అంజయ్య, పర్వతాలు, దర్శన్, జావీద్, చెన్నకేశవులు, సురేష్, శ్రీనివాస్, మల్లేష్, అనిల్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

### -వృధాగా పోతున్న మంచి నీరు.
### -పట్టించుకోని అధికారులు
### -గ్రామాలలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

**కేశంపేట అక్టోబర్ 15 ప్రభాతవార్త :**

రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. దీనికోసం వేల కోట్లు రూపాయలను వెచ్చించింది. ప్రజల కోసం ఇంత ఖర్చు చేసిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృధాగా మారుతుంది. మంచి నీటి కోసం ప్రజలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో కొన్ని కాలనీలకు మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా సర్కార్ పథకాలకు శ్రీకారం చుడుతుంటే క్షేత్ర స్థాయిలో మాత్రం వీటి ఫలితాలు ఆశాజనకంగా లేకుండా పోతున్నాయి. మిషన్ భగీరథ పైప్ లైన్లు లీకేజీ కావడం పగిలిపోవడం ఈ మధ్య పలుచోట్ల దర్శనమిస్తున్నాయి ఇలాంటి ఘటన తాజాగా మరోసారి కేశంపేట మండల పరిధిలో పోమాల్ పల్లి గ్రామంలో గ్రామంలో మిషన్ భగీరథ మంచినీరు పైపు లీకేజీ అయి వృధాగా పోతున్నాయి. ఇలా నెలకి ఒకసారి పైపులైకై నెలకు ఒకసారి నీళ్లు వృథాగా పోతున్నాయి. ఊరు మధ్యలో రోడ్డుపై నీరు ఏరులై పారుతున్నాయి. అయినా కూడా మిషన్ భగీరథ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా మిషన్ భగీరథ నీళ్ల నెలకు ఒకసారి లీక్ అయి వృధాగా పోతుండడంతో అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం పై గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. వాటికి మరమ్మతులు చేస్తున్న నెలల ఒకటి రెండుసార్లు ఇలా పైప్ లైన్ లీకై నీళ్లు వృధాగా పోతుండడంతో పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. నెలకు ఒకసారి పైపులను లీక్ అవుతూ ఇలానే వృధాగా నీరు వెళ్తుందని గ్రామస్తులు.. ఏదో రిపేర్ చేసేమా వెళ్లేమని తూతూ మంత్రంగా పనులు చేసి చేతులుదులుపుకుంటున్నారు తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఇలా ప్రతి నెలకోసారి రిపేర్ అవ్వడంతో సమస్యను పరిష్కరించడం లేదని ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి సమస్య పునరావృతం కాకుండా చేయాలని గ్రామ ప్రజలు పలు గ్రామాల డిమాండ్ చేస్తున్నారు.

## రుణాలు చెల్లించని 640 మంది రైతులకు నోటీసులు

### -కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు మంచాల పి.ఎ.సి.ఎ.స్ పనితీరు

**మంచాల సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** మంచాల మండలం మంచాల గ్రామంలోని రైతు సేవా సహకార సంఘం లో ఎల్.టీ రుణాలపై బకాయిలు చెల్లించని ఖాతాదారులకు నోటీసులు ఇచ్చారు. మార్చి వరకు 25 కోట్లు రావాల్సి ఉండగా సుమారు కోటి రూపాయల వరకే బకాయిలు వసూలు అయ్యాయని అధికారులు తెలిపారు. రుణాలు పొంది బకాయిలు చెల్లించని రైతులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దాదాపు 50 మంది రైతులు హాజరయ్యారు. గత నాలుగు సంవత్సరాల 640 బకాయి పడ్డ రైతులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఈనెల చివరి లోపు రుణాలు చెల్లిస్తామని సమావేశంలోని పాల్గొన్న రైతులు హామీ ఇచ్చారని జాయింట్ రిజిస్టర్ ఓ.ఎస్.డి సూర్య చంద్రా రావు తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ బాగుకై సహకరించాలని వెదిరె హనుమంత్ రెడ్డి రైతులందరికీ విజ్ఞప్తి చేశారు. సకాలంలో బకాయిలు చెల్లించని రైతులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెదిరె హనుమంత్ రెడ్డి, మేనేజర్ నవీన్ కాంత్ రెడ్డి, సూపర్వైజర్ బలవంత రెడ్డి ,నాగరాజు, సీఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## కిసాన్ యాప్‌పై అవగాహన సదస్సు

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 15, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల క్లస్టర్‌లోని పొట్లపల్లి గ్రామంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్ పైన అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఏ కె.మల్లయ్య మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంట వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యటించి డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు పంట వివరాలను పారదర్శకంగా క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. ప్రతి రైతు వ్యాస్తవంగా ఏ పంటను అయితే సాగు చేశారో ఆ పంటను మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. పత్తి రైతులు పత్తి అమ్మకాల కోసం కపాస్ కిసాన్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.పూజ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సిపిఆర్, కాలానుగుణ వ్యాధుల పట్ల అవగాహన శిక్షణ


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 15, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నవ భారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, జీవీకే ఈఎంఆర్ఐ 108 సేవల ఆధ్వర్యంలో బుధవారం సీపీఆర్, కాలానుగుణ వ్యాధుల పట్ల అవగాహన, శిక్షణ తరగతులను నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రామ్ మేనే జర్ షేక్‌జాన్ షాహిద్, జిల్లా ఈఎంఈ హరి రామకృష్ణ ఆదేశాల మేరకు ఈఎంటి విష్ణువర్ధన్, పైలెట్ సతీష్‌రెడ్డిలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గంగారవేణి రవి, డైరెక్టర్ గంగారవేణి రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి : సిఐ



మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

**కొమురవెల్లి, అక్టోబరు 15, ప్రభాతవార్త :** అవసరం ఉంటే తప్ప సోషల్ మీడియాను ఉపయోగించొద్దని చేర్యాల సిఐ శ్రీను అన్నారు. కొమురవెల్లి కేజీబీవీ స్కూల్, కాలేజ్ విద్యార్థులకు బుధవారం బాలికల, మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవిటీజింగ్, నూతన చట్టలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దిశ చాలా కీలకమని సక్రమ మార్గంలో వెళ్లే వారు ఉన్నత స్థితికి వెళ్తారని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించుకొని ఇష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, కాలేజ్ స్పెషల్ ఆఫీసర్ నీరజ, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం ఎఎస్ఐ సదయ్య, కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిగా సైదులు

### -సన్మానించిన పిఆర్‌టియు నాయకులు


ఎంఈఓ సైదులును సన్మానిస్తున్న పిఆర్‌టియు నాయకులు

**జగదేవ్‌పూర్, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న బి.సైదులు బుధవారం మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని పిఆర్‌టియుటిఎస్ జగదేవ్‌పూర్ మండల శాఖ అధ్యక్షుడు చిలుకూరి వెంకట్రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాత్లావత్ బొద్దునాయక్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా శ్రీకొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ టియు రాష్ట్ర నాయకులు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, రఘురాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానో పాధ్యాయులు శ్యాంసుందర్‌రావు, మండల అసోసియేట్ అధ్యక్షుగు నగేష్, ఉపాధ్యక్షులు భగవాన్‌రెడ్డి, కార్యదర్శి రంజిత్‌కుమార్, సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, నర్సింలు, షకీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా పద్మశాలి సంఘం ఎన్నికల ప్రచారం

**గజ్వేల్, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సహ కార సంఘం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన బొల్లిబత్తుల దేవదాసు ప్యానల్ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్ లోని బిడి కాలనీలో పద్మశాలి కులస్తుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా పదవీ విరమణ చేసినప్పటి నుండి సంఘంలో చురుకుగా పాల్గొంటున్నానని, పద్మశాలిల సమస్యలను పరిష్కరించేందుకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. నన్ను భారీ మెజార్టీతో గెలిపిస్తే సంఘం బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తనతో పాటు తన ప్యానల్‌లో నిలుస్తున్న కోట కిషోర్, గాడిపల్లి ఎల్లంరాజు, దేవసాని హనుమాన్‌దాస్, సబ్బని నరేష్‌లను గెలిపిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గాడిపల్లి అనూప్ తదితరులు పాల్గొన్నారు.


గెలిపించాలని కోరుతున్న బొల్లిబొత్తుల దేవదాసు

# ముగిసిన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం

**పటాన్‌చెరు, అక్టోబరు 15, ప్రభాతవార్త**
జాతి నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమైనదని యువ నాయకులు ఎం.హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట హైదరాబాద్ జాతీయ సేవా పథకం చైర్మన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మావతి, యూనిట్ 1 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీ.నరసింహులు, యూనిట్ 3 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.మధుకర్ రావు ల ఆధ్వర్యంలో ఏడవ రోజు ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరము ముగిసింది. సంగారెడ్డిజిల్లా పటాన్‌చెరు మండలం ఐనోల్ మండల పరిషత్ ప్రాథమిక ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఉన్నతమైనదని, ఇటువంటి ఎన్ఎస్ఎస్ శిబిరాలకు హాజరు కావడం వల్ల గ్రామీణ ప్రాంత సమస్యల పట్ల అవగాహనతో సమాజాభివృద్ధికి, సామాజిక మార్పునకు జ్ఞాన సముపార్జనకు ఎక్కువ సమయం కేటాయించాలని తెలిపారు. ప్రేరణాత్మక సందేశాన్ని ఇచ్చినందుకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రాథమికపాఠశాల హెచ్ఎం ప్రమీల మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం ఆలవర్చుకోవడం వల్ల తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునని సూచించారు. పెద్దకజ్జర్ల జెడ్పిహెచ్ఎస్ ఉపాధ్యాయులు సంగ్మెట్టి మాట్లాడుతూ.. విద్యార్థులు కఠిన శ్రమ ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని, అందుకు ఇటువంటి కార్యక్రమాలు దోదపడతాయని చెప్పారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజం పట్ల దేశం పట్ల అభిమానంతో జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం హర్షవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన గ్రామ పెద్దలు, మహిళలు, యువకులకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు కృతజ్ఞతలు తెలిపారు.


సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

## ఆవంచలో రైతులకు సస్యరక్షణపై అవగాహన

**నర్సాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో రైతులకు పంట పొలాలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడంపై హైదరాబాద్లోని లొయోలా వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పిం చారు. మంగళవారం ఆవంచ గ్రామపంచాయతీ వద్ద రైతుల సమక్షంలో లింగాకర్షణ బుట్టల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాట్లాడుతూ రైతులు వేసిన పంటలలో హానికరమైన పురుగులను నియంత్రిం చడానికి రసాయనాలు లేకుండా ఉపయోగించే పద్ధతులను తెలియజేశారు. అంతేకాకుండా హానికరమైన పురుగులు వ్యాప్తి చెందడంతో పంటలకు నష్టం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా వరి పత్తి పంటల్లో ఈ లింగాకర్షణ బుట్టలు ఉపయోగించడం ద్వారా హానికర పురుగుల నియంత్రణ సాధ్యమవు తుందని తెలిపారు. ఈ లింగాకర్షణ బుట్టల అమర్చే విధానం ఎన్ని రోజులకు ఒకసారి ఈ బుట్టలను మార్చాలి వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈ బుట్టల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అవసరమున్న రైతులకు లింగాకర్షణ బుట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లొయోలా వ్యవసాయ కళాశాల విద్యార్థులు అఖిల, ప్రియ, సౌజన్య, దేవిశ్రీ, శేషసాయి, సరీన, రైతులు పాల్గొన్నారు.

ఫొటో రైటప్ :ఆర్ఎన్ 2.నర్సాపూర్ లో ని చైతన్యపురి కాలనీలో నిర్వహించిన కాటన్ సెర్చ్ లో బాగంగా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నతూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తదితరులు

## నర్సాపూర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్


విద్యార్థులతో మాట్లాడుతున్న తూప్రాన్ డిఎస్పి నరేందర్‌గౌడ్

**నర్సాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధి లోని చైతన్యపురి కాలనీలో పోలీసులు బుధవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్‌గౌడ్, తూప్రాన్ సిఐ రామకృష్ణ, నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్‌తోపాటు 100 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు కాలనీలో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. కుటుంబ సభ్యులను వివరాలు తెలుసుకున్నారు. ఈ కాటన్ సెర్చ్ లో భాగంగా ఎటువంటి పత్రాలు లేని 66 వాహనాలను సీజ్ చేశారు. ఇందులో ఏడు ఆటోలు 59 మోటార్ బైకులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అపరిచిత వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసు లకు అందజేయాలన్నారు. ఈ మేరకు కాలనీ ప్రజలంతా నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు తావివ్వకుండా అందరూ మంచిగా మెలిగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు పలు విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తో పాటు ఇతర మండలాలఎస్సైలు పోలీసులు తదితరులు పాల్గొన్నారు

## ఫోక్‌డ్యాన్సులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**వెల్దుర్తి, అక్టోబరు 15, ప్రభాతవార్త :**


ఫోక్ డ్యాన్సులో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు

జిల్లా కేంద్రమైన మెదక్‌లో బుధవారం జరిగిన కళా ఉత్సవ్ జిల్లా స్థాయి ఫోక్ డాన్స్ పోటీల్లో కుక్నూర్ గ్రామానికి చెందిన హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారు. ఏం నివేదిత. కె.కీర్తన. ఆర్.అమూల్య, ఎల్ కళ్యాణీలు పోటీలో గెలుపొందారని అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు డివో రాధాకిషన్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు

## అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవ పత్రికను ఆలయ కమిటీ సభ్యులకు అందజేత

**నర్సాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని నవంబర్ నెల 26న ప్రారంభం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సనత్ నగర్ లోని అయ్యప్పస్వామి ఆలయంలో మాన్యశ్రీ అరుణ్ గురు స్వామి చేతుల మీదుగా ఆలయ ప్రారంభోత్సవ పత్రికలను నర్సాపూర్ అయ్యప్పఆలయ కమిటీ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్ తో పాటు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవాన్ని నవంబర్ నెల 26న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టను అరుణ్ గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవ పత్రికను అరుణ్ గురు స్వామి చేతులమీదుగా తీసుకోవడం జరిగిందని అశోక్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్ తో పాటు వైస్ చైర్మన్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, సలహాదారులు రాములు గుప్తా, బి అశోక్ గౌడ్, కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ శంకర్ ముదిరాజ్, గంగారాం గౌడ్ మురళి రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..



పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## దూమపానానికి దూరంగా ఉండాలి

### -పొగాకు నియంత్రణ పర్యవేక్షకుడు విష్ణువర్ధన్‌రెడ్డి

**చౌటకూరు, అక్టోబరు 15, ప్రభాతవార్త:** ప్రతిఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పొగాకు నియంత్రణ పర్యవేక్షకులు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి నాగ నిర్మల ఆదేశాల మేరకు మండల పరిధిలోని తాడ్దానిపల్లి చౌరస్తాలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులతో పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని విష్ణువర్ధన్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించి పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిం చారు. టొబాకో ఫ్రీ యూత్ కాంపెయ్3.0లో భాగంగా క్యాంపెయిన్ నిర్వహి స్తున్నట్లు వివరించారు. యువతన లక్ష్యంగా చేసుకుని 60 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పొగాకు ఉత్పత్తులైన గుట్కా, కైని, జర్ద, సిగరేట్, చుట్ట, బీడి పాన్ మసాల వినియోగంతో నోరు, గొంతు, ప్రేగు, ఊపిరితిత్తులు, గుండె క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలకు వంద గజాల దూరంలో పొగాకు సంబంధించిన దుకాణాలు ఉండకుండా చూడాల న్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులను వినియోగించకూడదని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

### ముదిరాజ్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిగంబర్‌రావు


రాయరావుచెరువు కట్టపై మొక్కలు నాటుతున్న దిగంబర్‌రావు తదితరులు

**నర్సాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచాలని ముదిరాజ్‌సంఘం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దిగంబర్‌రావు అన్నారు. బుధవారం రాయరావు చెరువు కట్టపై ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచి నట్లయితే చెట్లు గా మారి మనకు ఆక్సిజన్ అందిస్తుందని తెలిపారు. ఈ చెట్లు మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మొక్కలు నాటగానే సరిపోదని వాటిని సంరక్షి ంచినప్పుడే సార్ధకమని తెలిపారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి దిగంబర్ రావు తో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**వెల్దుర్తి, అక్టోబరు 15, ప్రభాతవార్త :** ఈనెల 15 నుండి నవంబర్ 11వ తేదీ వరకు జాతీయ గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం జరుగుతుందని స్థానిక పశువైద్యాధికారి రేఖ రసజ్ఞ తెలిపారు. బుధవారం నాడు మండలంలోని చేరిలా గ్రామంలో గాలికుంటు నివారణ వ్యాధి కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. 7 వా విడత గాలికుంటు నివారణ కార్యక్రమంలో గోజాతి మండలంలో 1400 ఉన్నాయని గేత జాతి 4,800. మొత్తం 6 200 పశువులు ఉన్నాయన్నారు. మండలంలో మూడు టీములుగా పసివాధ్యాధికారులు ఏర్పడి ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫజల్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## బివి రాజుకు ఘన నివాళులు

**నర్సాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త :** పట్టణంలోని బివిఆర్ఐటి ఇంజ నీరింగ్ కళాశాలలో బుధవారం బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీ విష్ణు విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ పద్మభూషణ్ బీవీ రాజు 10 వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీవిష్ణు విద్యాసంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు, అనాధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణు విద్యాసంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ బివి రాజు నాటిన విద్యా సంస్థల మొక్క నేడు మహా వృక్షంగా మారిందన్నారు. బివి రాజు చేసిన విశిష్ట సేవలకు సిమెంటు పరిశ్రమలు, విద్యాసంస్థల ఏర్పాటు ఆయన గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ఆయన స్థాపించిన విష్ణు విద్యా సంస్థల్లో 20వేల మంది విద్యార్థులు చదువుతుండగా 4000 మంది ఉపాధ్యాయులు 3000 మంది బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తు ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ పద్మభూషణ్ బివి రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బోధనేతర సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ్మ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ దూబె, కళాశాల మేనేజర్ బాపిరాజు, ఏఓలు టిఎల్ఎన్ సురేష్, అశోక్ రెడ్డి, వివిధ విభాగాల


బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాల సిబ్బందికి దుస్తులు పంపిణీచేస్తున్న దృశ్యం

## 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**జగదేవ్‌పూర్, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** ఈనెల 21 నుండి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రస్థాయి ఫొటో గ్రఫీ, లఘుచిత్రాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీల నిర్వహణ ఉంటుందని, పోలీసు అమరవీరుల సంస్మ రణ వారోత్సవాలు ఈనెల 21 నుండి 31 వరకు కొనసాగుతాయని ఈ వారాంతంలో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నామని, 21 నుండి 24 వరకు పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌజ్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసుల విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, డ్రగ్, డాగ్‌స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజలకు పోలీసులు అందించే సేవలు, పోలీసులు చేసిన ప్రతిభ, త్యాగా లపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ, లఘుచిత్రాలు, వ్యాసరచన పోటీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని పాల్గొనాలని అన్నారు.

## అయ్యప్పల మహా పాదయాత్ర ప్రారంభం

### 1440 కిలోమీటర్ల దూరం..5 రాష్ట్రాల మీదుగా ప్రయాణం

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** అయ్యప్ప శరణు ఘోషల మధ్య సిద్దిపేట నుంచి శబరిమలై వరకు అయ్యప్పల మహా పాదయాత్ర బుధవారం సిద్దిపేటలో ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కోటిలింగేశ్వర స్వామి దేవాలయం భిక్ష చేసిన అయ్యప్పలు సాయంత్రం పాదయాత్రగా ప్రయాణాన్ని ప్రారంభించారు. పాదయాత్రను సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు ప్రారంభించారు. విభిన్న వేషధారణలతో, మంగళవాయిద్యాలు, డప్పుమోతలతో ప్రారంభమైన పాదయాత్రకు భక్తులు అడుగడుగునా నీరాజనం పలికారు. మహిళలు మంగహారతులతో స్వాగతం పలికారు. శ్రీ అఖిల అయ్యప్ప శబరిమలై ట్రస్ట్, సిద్దిపేట కోటిలింగాల అయ్యప్ప సన్నిధానంల ఆధ్వర్యంలో ప్రారంభమైన మహా పాదయాత్రలో వివిధ ప్రాంతాల నుంచి 120 మంది అయ్యప్ప స్వాములు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ ఏపి, కర్ణాటక, తమిళనాడుల మీదుగా కేరళ రాష్ట్రంలోకి ప్రవేశించి 1440 కిలోమీటర్ల దూరం పాదయాత్ర కొనసాగుతుంది. నవంబరు 26న మహా పాదయాత్ర ముగిస్తుందన్నారు. మహా పాదయాత్ర వలన లక్షల కోట్ల జపం, అయ్యప్ప నామస్మరణం జరుగుతుందని మహా పాదయాత్ర సారధులు గడప నాగరాజుస్వామి, మధుసూదన్‌రెడ్డి స్వామి, యాదవరెడ్డి స్వామిలు తెలిపారు. పాదయాత్రలో పాల్గొన్న అయ్యప్ప స్వాములకు ఆరోగ్యం, ధైర్యం, విశ్వాసం లభిస్తాయని తెలిపారు. అయ్యప్ప ఆశీస్సులతో ప్రజల సహకారంతో పాదయాత్ర విజయవంతంగా కొన్ని యేండ్ల నుంచి సాగుతుందన్నారు.

## బిజెపిలో చేరికలు

**హత్నూర, అక్టోబరు 15, ప్రభాతవార్త :** హత్నూర మండలం నవపేట గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుధవారం ఎంపీ రఘునాథన్ రావు సమక్షంలో బిజెపిలో చేరారని హత్నూర మండల బిజెపి పార్టీ అధ్యక్షులు నాగ ప్రభు గౌడ్ తెలిపారు.

## నేడు గజ్వేల్‌లో వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పులి రాజు

**గజ్వేల్, అక్టోబరు 15 (ప్రభాతవార్త):** పట్టణంలోని మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణ చేయడం జరుగుతుందని ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి, రచయిత పులి రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నేడు జరగబోయే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి రైతులు, అభిమానులు, సాహితివేత్తలు, కవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మల్లికార్జున్, కనకయ్య, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఉమర్, గంగిశెట్టి నర్సింలు, సామాజిక కార్యకర్త కళాధర్, సాదిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

### -ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ


తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న వైద్యులు

**గజ్వేల్, అక్టోబరు 15(ప్రభాతవార్త):** అంతర్జాతీయ తల్లిపాల వారోత్స వాలను పురస్కరించుకొని బుధవారం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అమృతంలాంటివని, తల్లిపాలు తాగించడం వల్ల పుట్టిన పిల్లలకు రోగ నిరో ధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలన్నారు. అనంతరం సిడిపిఓ సరిత మాటాడుతూ స్థానిక అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు ప్రతిరోజు పాలు, పౌష్టికాహారం ఇస్తున్నామని, శిశువులకు ఆరునెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారం భించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి, మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శైలజ, ఆర్ఎంఓ డాక్టర్ రాము, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ మంజుల, డాక్టర్ సుజాత, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ మెహరాజ్ భాను, రజిత, హెడ్ నర్సు వకులాదేవి, నర్సింగ్ ఆఫీసర్స్ షకీరా, మయూరి, దేవసాని వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పరుగుపందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు సదాన లిఖిత ఎంపిక

**వెల్దుర్తి, అక్టోబరు 15, ప్రభాతవార్త :**
బుధవారం జిల్లా కేంద్రమైన మెదక్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 200 మీటర్ల పరుగు పందెం పందెంలో ఉన్నత పాఠశాల వెల్దుర్తికి చెందిన విద్యార్థిని సదానంద జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కన బరిచి మొదటి స్థానంలో నిలవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. ప్రస్తుత ఎంపికైన సదల లిఖితను ప్రధానోపాధ్యాయులు తో పాటు ఉపాధ్యాయ బృందం శాలువాలతో అభినందించి సత్కరించారు.


సదాన లిఖిత ను సన్మానిస్తున్న హెచ్ఎం ఉపాధ్యాయులు తదితరులు

## నల్లవాగు గురుకులాన్ని తనిఖీ చేసిన ఎంఈఓ



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

**సిర్గాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
మండలంలోని నల్లవాగు గురుకులం పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్, ఫుడ్‌కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు బోధనచేస్తున్న విధానాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తిభోజనం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## 17న చలో రాజ్‌భవన్ కార్యక్రమం

**మునిపల్లి, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
బిసి రిజర్వేషన్లపై 17న చలో రాజ్‌భవన్ కేంద్రం వెంటనే 42 శాతం రిజర్వేషన్ల అమలు బిల్లును ఆమోదించాలని, పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని, 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 17న చలో గవర్నర్ కార్యక్రమానికి సిపిఐ(ఎం) రాష్ట్రకమిటీ పిలుపు మేరకు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు రమేష్‌గౌడ్ కోరారు. పార్టీ శ్రేణులు, బిసి వర్గాలు, సామాజిక శక్తులు, సంస్థలు, వ్యక్తులు అందరూ పాల్గొనాలని సిపిఎం పార్టీ మునిపల్లి మండల నాయకులు రమేష్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర శాసనసభలో బిసి రిజర్వేషన్ల బిల్లును బిజెపి ఆమోదిస్తూనే కేంద్రంలో మాత్రం అడ్డుకుంటుందన్నారు. ఆపార్టీ నాయకులు, ఎంఎల్ఎలు, ఎంపిలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్‌కు, రాష్ట్రపతికి పంపితే ఉద్దేశ్యపూర్వకంగానే ఎలాంటి ఉత్తర్వులు రాకుండా, బిసిలకు రిజర్వేషన్లు అమలుకాకుండా కేంద్రప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపించారు. ఈనెల 18న జరిగే రాష్ట్రబంద్‌కు మద్దతు ఇవ్వాలని బిసి జెఎసి నేతలు సిపిఐ(ఎం) రాష్ట్ర ఆఫీసుకు వచ్చి మెమోరాండం ఇచ్చి కోరారన్నారు. ఈబంద్‌కు స్పష్టమైన డిమాండ్స్‌ను పెట్టాల్సిన అవసర ముందని సిపిఐ(ఎం) భావిస్తున్నది. కేంద్ర బిజెపిప్రభుత్వంపై పోరాటం చేయాలని లేనియెడల తమపార్టీ ఆధ్వర్యంలో బిసిలకు 45శాతం రిజర్వేషన్ల సాధనకై తాము స్వతంత్రంగా పోరాటం చేయాలని తమపార్టీ స్పష్టం చేసిందన్నారు.

## కెజిబివిలో ఘనంగా బాలికాదినోత్సవం



అంతర్జాతీయ బాలికాదినోత్సవం జరుపుకుంటున్న దృశ్యం

**ఝరాసంగం, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మండలకేంద్రమైన ఝరాసంగంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య ముఖ్యఅతిథిగా హాజరై జువైనెల్ జస్టిస్ యాక్ట్, పోక్సో యాక్ట్, బాలలరక్షణ చట్టాల ప్రాముఖ్యతపై వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం తథ్యమన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి కె.లలితకుమార్ మాట్లాడుతూ ప్రతి బాలిక తనలో దాగివున్న శక్తినిగుర్తించి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఈసందర్భంగా మొక్కలునాటి నషాముక్తభారత్ అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతిభచాటిన విద్యార్థినులకు అవార్డులు అందచేశారు. కార్యక్రమంలో సిడిపిఓ అంజమ్మ, ఝరాసంగం ఎస్ఐ క్రాంతికుమార్, కెజిబివి ప్రత్యేక అధికారి నిర్మల, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గ లింగాయత్ సమాజ్ ఎన్నికలు



సమావేశంలో పాల్గొన్న ఇప్పపల్లి నర్సింలు, సమాజ్ బాధ్యులు

**జహీరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
ఈనెల 16న నియోజకవర్గకేంద్రమైన జహీరాబాద్‌పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గటలకు నియోజకవర్గ వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్ష, కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వీరశైవ లింగాయత్ సమాజ్ అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఆగూర్ శివరాజ్ తెలిపారు. బుధవారం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు ఆధ్వర్యంలో బసవేశ్వర ఫంక్షన్‌హాల్‌లో సమాజ్ సభ్యులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణకు తీర్మానంచేస్తూ నియోజకవర్గ అడ్‌హాక్ కమిటీని ఏర్పాటుచేశారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా నియోజకవర్గంలోని ఆయామండలాలనుంచి సభ్యులను నియమించారు. జహీరాబాద్‌మండల అడహాక్ కమిటీ సభ్యులుగా ఆగూరు శివరాజ్, ఆర్.సుభాష్, సిద్దపురం అరుణ్, బండి శ్రీనివాస్, శెట్టి విజయ్ కుమార్, అరుణ్ కౌలాస్, నిజాంపేట్ రవి, శంభుని శివశంకర్, మొగుడంపల్లి మండలం నుంచి ఎన్.జగన్నాథం, మామిడి రామ్‌శెట్టి, ఝరాసంగం మండలంనుంచి జగన్, పరమేశ్వర్‌పాటిల్, నవీన్‌రాజోజి, కోహీర్‌మండలం నుంచి బస్వరాజ్, విజయ్‌కుమార్, పి.వీరేశం, అక్షయ్‌జాడే, న్యాల్‌కల్ మండలం నుంచి సిద్దన్నని నియమించినట్లు వివరించారు. గురువారం జరిగే ఎన్నికలకు నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి వీరశైవులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వినతిచేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ వీరశైవ అధ్యక్షులు రాజ్‌శేఖర్ శెట్కార్, జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పట్లోళ్ల ప్రశాంత్‌పాటిల్, జిల్ల మహిళా అధ్యక్షురాలు పట్లోళ్ల అరుణ, ప్రధాన కార్యదర్శి గొర్రెగట్టు శారద, సంగారెడ్డి నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల శివకుమార్, సదాశివపేట మండల అధ్య క్షులు నాగేశ్వర్ చాట్ల నరేందర్, భవానిప్రసాద్, పద్మ, అంజన్న, సంగమే శ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగుకు యాజమాన్య పద్ధతులు

**–పంటలను పరిశీలించిన ఎడిఎ నూతన్‌కుమార్**

**మనూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
పంటల్లో అధికదిగుబడిని సాధించేందుకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉంటుందని ఎడిఎ నూతన్‌కుమార్ అన్నారు. మండలపరిధిలోని మాయికోడ్‌లో రైతులు సాగుచేస్తున్నపంటలను నూతన్ కుమార్ పరిశీలించి రైతులకు పలు సూచనలుచేశారు. పత్తిపంట తీసుకున్నాక వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే తప్ప, పంటలు సాగు చేయకూడదన్నారు. కందిపంటను వ్యవసాయ అధికారులు సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఈఓ సంగమేశ్వర్, రైతులు ఉన్నారు.

# కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వసతులు కల్పిస్తాం

**-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాతరావు**

**రామాయంపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
రామాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధికేంద్రాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాతరావు ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడానికి గ్రామానికి చెందిన వ్యాపారి దారం రమేష్ కుమారుడు శంకర్ సహకారంతో నీటి శుద్ధికేంద్రం ఏర్పాటుచేశారు. ప్రజలకు స్వచ్ఛమైననీరు అందించడం కోసం కృషి చేసిన వ్యాపారిని స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చౌదరి సుప్రభాత్‌రావు మాట్లాడుతూ, రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో త్వరలో పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయడమే కాకుండా అన్నిరకాల వైద్యం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రిలో కొన్ని సౌకర్యాలు కల్పించామని రాబోవు రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రజలకు



–సుప్రభాతరావును సన్మానిస్తున్న డాక్టర్‌లు

వైద్యం అందించేందుకు 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ లింబాద్రి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి ..., మాజీ కౌన్సిలర్ దేమే యాద గిరి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి డి.జి.శ్రీనివాసశర్మ, దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు బోరంచ విద్యార్థినులు



వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

**మనూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల వాలీబాల్ పోటీలు (అండర్ 14)లకు మండల పరిధిలోని బోరంచగ్రామంలో ప్రభుత్వపాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థినులు ఎంపికయ్యారు. మంగళవారం ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పాఠశాలలో విద్యను అందుకుంటున్న అఫ్జ్‌బేగం, భవానిలు క్రీడల్లోపాల్గొని తమప్రతిభను చాటుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌స్వామి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 18న ఉమ్మడి పది జిల్లాల పోటీల్లో ప్రతిభకనబర్చి, రాష్ట్రపోటీలకు ఎంపికకావాలని హెచ్‌ఎం శివకుమార్‌స్వామి విద్యార్థినులకు సూచిస్తూ ఆల్‌ద బెస్ట్ చెప్పారు. పోటీల్లో ప్రతిభ చాటేందుకు సహకరించిన పాఠశాల పిడి రవికుమార్‌ను పాఠశాల శివకుమార్‌స్వామి అభినందించారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అభిలాష్

**అల్లాదుర్గం, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ముస్లాపూర్‌గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 10వ తరగతిలో విద్యను అందుకుంటున్న మండలపరిధిలోని బహిరన్‌దిబ్బ గ్రామానికి పాంపాటి అభిలాష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ పేర్కొన్నారు. అండర్17 విభాగంలో ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అభిలాష్ ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. అభిలాష్‌ను వాలీబాల్‌లో ప్రతిభచాటేలా మెరుగుదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు దేవానందును పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అభినందించారు.

## కార్యకర్తల అభీష్టం మేరకే డిసిసి అధ్యక్షుడి ఎంపిక

**–పటాన్‌చెరులో ఎఐసిసి అబ్జర్వర్ ఆధ్వర్యంలో సంఘటన సృజన్**



ఎఐసిసి అబ్జర్వర్‌ను సన్మానిస్తున్న నీలం మధుముదిరాజ్

**రామచంద్రాపురం, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
కార్యకర్తలు, మండల, బ్లాక్ స్థాయి అధ్యక్షుల అభీష్టం మేరకు సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) అధ్యక్షుల నియామకం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు నీలం మధుముదిరాజ్ అన్నారు. బుధవారం రామచంద్రాపురం పట్టణ పరిధిలోని అశోక్‌నగర్‌లో ఎఐసిసి అబ్జర్వర్ సజరిట లైత్ ప్లాంగ్, పిసిసి అబ్జర్వర్ జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావుల ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సంఘటన్‌సృజన్ అభియాన్ సమావేశం నిర్వహించగా నీలం మధుముదిరాజ్ పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తల అభిప్రాయాన్ని క్రోఢీకరించి జిల్లా అధ్యక్షులను ఎంపిక చేయడం శుభపరిణామమన్నారు. పార్టీ కోసం కష్టపడేవారికి పదవులు దక్కితే పార్టీ అభివృద్ధి చెందుతుందని గుర్తుచేశారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల బ్లాక్, మండల, గ్రామస్థాయి నాయకుల అభిప్రాయాలు తీసుకుని ఎంపికచేసే అధ్యక్షుడికి జిల్లా అధ్యక్షుడికి ప్రతి కార్యకర్త సంపూర్ణంగా మద్దతు పలుకుతూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు ముజాహిద్ అలంఖాన్, గాలి అనిల్ కుమార్, పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, శశికళ యాదవరెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, బ్లాక్, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన బిఆర్ఎస్ యువనాయకులు



మాజీమంత్రి హరీష్‌రావును కలిసిన బిఆర్ఎస్ యువనాయకులు

**సదాశివపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
బుధవారం హైదరాబాదులోని హరీష్‌రావు నివాసంలో సదాశివపేట టిఆర్ఎస్ యువనాయకులు సాయితేజపాటిల్, అభిషేక్‌పాటిల్ ఆధ్వర్యంలో హరీష్‌రావును కలిసి శాలువావేసి, పుష్పగుచ్ఛంతో దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా సాయితేజ, అభిషేక్‌లు మాట్లాడుతూ యువత రాజకీయాల్లో ముందుండాలని, నేటి యువకులే రేపటి యువనాయకులుగా రాజకీయాల్లో ఎదగాలని సమాజసేవలో ముందుండాలని హరీష్‌రావు ప్రశంసించారన్నారు. ఈ కార్యక్రమంలో శరత్, గణేష్, మోసిన్, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18న రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయండి

**–బిసి సంఘాల నాయకులు డిమాండ్**



బంద్ కరపత్రం రిలీజ్ చేస్తున్న దృశ్యం

**రామాయంపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
రామాయంపేట మండల కేంద్రంలో బుధవారం బిసి సంఘాల జెఎసి సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఈనెల 18న నిర్వహించనున్న బందు విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎంతోకాలంగా బిసి రిజర్వేషన్ కోసం పోరాటంచేస్తున్నామని, చివరిదశకువచ్చిన బిసి రిజర్వేషన్‌ను అడ్డుకోవడం తగదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అగ్రవర్ణాలు 10 రోజుల్లోనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ సాధించుకున్నారని, బిసిలు 42 కోసం పోరాటంచేస్తే అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుచేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. ఈనెల 18న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త బందుకు వర్తక, వ్యాపార, విద్యారంగ సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి బందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసిసంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం, సంఘం జిల్లా నాయకులు సుంకోజు దామోదర్, పోచమ్మల గణేష్, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, అల్లాడి వెంకటి, వినయ్‌సాగర్, సిద్ధరాములు, ఉడుత శ్రీశైలం, నవాత్ మహేష్, నవాత్ నవీన్, పచ్చుంటి రాము, మద్దెల రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లవాగు గురుకులంలో వైద్య శిబిరం

**సిర్గాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
మండలంలోని నల్లవాగు గురుకులం పాఠశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేశారు. దగ్గు, జలుబు, జ్వరంతో అవస్థలుపడుతున్న, పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ ప్రతిభ సూచించారు. చేతులు శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జయరాం, చంద్రశేఖర్, రామచందర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## కడపల్‌లో పశువులకు వ్యాధి నివారణ టీకాలు

**సిర్గాపూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కడపల్ గ్రామంలో పశువులకు బుధవారం గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేశారు. నారాయణఖేడ్ ఎడి డాక్టర్ గంగాధర్, డాక్టర్ జెస్సీ క్రాంతిలు పశువులకు టీకాలు వేస్తూ శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు గాలికుంటవ్యాధి వ్యాప్తిచెందకుండా ముందస్తుగా జాగ్రతలో భాగంగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గంగాధర్ సూచించారు.

# అబ్దుల్ కలాం జయంతి

**-రాయిపల్లిలో విద్యార్థుల దినోత్సవం**

**-అబ్దుల్ కలాంకు నివాళులు అర్పించిన విద్యార్థులు**



రాయిపల్లిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

**మనూర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
యువశక్తికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం ఆదర్శంగా నిలుస్తారని యూత్ ఫర్ హ్యూమానిటీ అసోసియేషన్ బాధ్యులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం భారత దేశానికి అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. యువతకు కలాం సూచించిన మార్గం దిక్సూచిలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అమీర్, అసద్, సంగమేశ్వర్, రెహ్మాన్, పాఠశాల ఉపాధ్యాయులు పండరి, స్రవంతి, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

**–దుర్గమ్మ దర్శనానికి ఆలయం సిద్ధం**

**–60 రోజులగా జలదిగ్బంధం**



ఆలయాన్ని శుభ్రంచేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
ప్రసిద్ధిచెందిన ఏడుపాయలదుర్గమ్మ ఆలయం భక్తులదర్శనానికి ముస్తాబవుతోంది. 60రోజులుగా మంజీరావరదల్లో మునిగి, తేలిన ఆలయాన్ని, సిబ్బంది శుభ్రంచేశారు. లక్షలాది క్యూసెక్కుల మంజీరాప్రవాహంతో ఏడుపాయల ఆలయం పూర్తిగా దెబ్బతిన్నది. క్యూలైన్లు, రేకులు, ఫ్లోరింగ్, గ్రానైట్ దెబ్బతిన్నాయి. లడ్డుప్రసాదం కౌంటర్ కొట్టుకుపోయింది. సుమారు రూ.1.50కోటి నష్టంవాటిల్లినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఆలయాన్ని శుభ్రంచేశారు. కాగా విద్యుత్ సరఫరా ఇంకా పునరుద్ధరించలేదు. బహుశా రెండురోజుల్లో ఆలయ దర్శనం ప్రారంభం కావచ్చుని ఆలయవర్గాలు తెలిపాయి.

## దైవచింతన అలవర్చుకోవాలి

**–ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి**



కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా బొల్లారంలో శ్రీరామ్‌మందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. అహింస, శాంతి, మానవత్వంతో ప్రతి వ్యక్తి మెలగాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు సేవాభావన కలిగి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**రెండు రోజులుగా పూజలు...**
ఆంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠ సందర్భంగా నిర్వాహకులు కొత్వాల్ కృష్ణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు పండితులు శాస్త్రోక్తంగా రెండు రోజుల పాటు ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

## నేడు జోగిపేటలో సంఘటన్ సృజన్ అభియాన్

**జోగిపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
జోగిపేటలో గురువారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ కాంగ్రెస్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు. దీనికి ఎఐసిసి అబ్జర్వర్‌తోపాటు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతారని తెలిపారు. ఇందులో జిల్లా అధ్యక్షపదవికి సంబంధించిన ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, దీనికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు హాజరుకావాలని వారు కోరారు.

## ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ




శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

**సదాశివపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
బుధవారం సదాశివపేట పట్టణంలోగల జీనియస్ స్కూల్‌లో భౌతిక శాస్త్రం టీచర్స్‌కు ఎ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్‌పై మూడురోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలియజేశారు. దీని ద్వారా విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధిచెంది సులభంగా పాఠ్యాంశాలను నేర్చుకోగలుగుతారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆర్పీలుగా కాన్వోపాత్ర, శ్రీదేవీ, జీనియస్ స్కూల్ కరస్పాండెంట్ రఘువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ ప్రీతి, భవిత కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాధారిత పంటలపై రైతులు దృష్టి సారించాలి

**–జిల్లా ఉద్యానశాఖ ఇంచార్జి సిహెచ్ పండరి**

**గుమ్మడిదల, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలో రాష్ట్రీయ కృషివికాస్ యోజన కింద వర్ష ఆధారిత కూరగాయల పంటల అభివృద్ధి పథకం కింద కూరగాయలువేసుకునే రైతులకు పథకంగురించి సమగ్ర కూరగాయల వ్యవసాయం, తేనెటీగల పెంపకం, వర్మీకంపోస్ట్ తయారీ గురించి పూర్తి అవగాహన కల్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ ఇంచార్జి సిహెచ్ పండరి ఉద్యానశాఖ అధికారి అనూషరెడ్డి, ఏఈఓ అస్మిత, రాజుగౌడ్, రవి, గ్రామస్థులు, రైతులు, మహిళారైతులు తదితరులు పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రావటంలేదని భర్త ఆత్మహత్యాయత్నం

**జోగిపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
భార్య కాపురానికి రాకపోవటంతో మనోవేదనకుగురైన వ్యక్తి పోలీస్ స్టేషన్ వద్దనే ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారంరాత్రి జరిగింది. ఇందుకుసంబంధించి జోగిపేట ఎస్ఐ పాండు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటలోని తోళ్లబస్తీకిచెందిన సలీంకు కొంత కాలం క్రితం వివాహం అయింది. అయితే మద్యానికి బానిసకావటంతో అతడిని భార్య వదిలివెళ్లిపోయింది. మనోవేదనకుగురైన సలీం జోగిపేట పోలీస్‌స్టేషన్‌వద్ద ఒంటిపై పెట్రోల్‌పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించగా, దానిని గమనించిన పోలీసులు అడ్డుకొని, అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

## చింతకుంటలో పంటల పరిశీలన

**జోగిపేట, అక్టోబరు 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చింతకుంటలో బుధవారం తెలంగాణ రైతువిజ్ఞాన వేదిక శాస్త్రవేత్త డాక్టర్ ఎ.నిర్మల పంటపొలాలను పరిశీలించారు. వరిపంట ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉందని, ఎరువులు సమపాళ్లలో అందించాలని రైతులకు సూచించారు. అంతేకాకుండా రైతులు వేసిన పలురకాల వరివంగడాల ద్వారా వచ్చే దిగుబడిగురించి వివరించారు. అయితే అందుకు అనుగుణంగా చేపట్టాల్సిన పలు అంశాలను ఆమె రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సీతారాం, మల్లేశం, నవీన్‌కుమార్, తలారి శ్రీరాములు, గాండ్ల సాయిప్రసాద్ తలారి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.